# దానకర్ణుడు రాజగోపాల్ ఉన్నారు.. నేనేం చేయగలను..

### మునుగోడు మహిళకు మంత్రి సాయం.. మధ్యలో చమత్కార వ్యాఖ్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ** : నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎంపీ రఘువీర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది.మునుగోడు నియోజకవర్గానికి చెందిన ఓమహిళ తన వ్యక్తిగత సమస్యలను రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చింది.ఆమె వినతిని ఆలకించిన మంత్రి చమత్కారంగా స్పందిస్తూ,మునుగోడులో పెద్ద దానకర్ణుడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఉన్నారుగా...నేనేం చేయగలను..నేనే ఇంకా సర్కార్ క్వార్టర్స్‌లో ఉంటున్నా అని నవ్వుతూ వ్యాఖ్యానించారు.మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలతో అక్కడ ఉన్నవారు చిరునవ్వులు చిందించారు.అనంతరం మహిళ ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న మంత్రి,ఆమెకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో షాపు ఏర్పాటు కోసం రూ.50 వేల ఆర్థిక సహాయం అందించాలని తన సిబ్బందిని ఆదేశించారు. మంత్రి చేసిన చమత్కార వ్యాఖ్యలు, వెంటనే ప్రకటించిన ఆర్థిక సహాయం అక్కడున్న వారిని ఆకట్టుకున్నాయి.


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 30 జూన్ , 2026 | పేజీలు : 7


# మున్సిపల్ సమావేశం ఉద్రిక్తం

### సమస్యలపై బ్యానర్ ప్రదర్శన.. అభివృద్ధి నిధుల కేటాయింపుపై విమర్శలు
### రూ.83 కోట్ల ఫిల్టర్ బెడ్ ప్రాజెక్టుతో తాగునీటి సమస్య పరిష్కారం
### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం సోమవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది.సమావేశం ప్రారంభంలో వివిధ డివిజన్లకు సంబంధించిన అభివృద్ధి,పారిశుధ్యం,తాగునీరు,డ్రైనేజీ సమస్యలపై చర్చ జరుగుతుండగా రెండో డివిజన్ కార్పొరేటర్ పెరికె యాదయ్య తన వార్డులో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చేందుకు బ్యానర్ ప్రదర్శించారు.వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాట్లాడుతుండగా కొందరు కాంగ్రెస్ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. నువ్వు ఎంత అంటే.. నువ్వు ఎంత అంటూ పరస్పరం దూషణలకు దిగడంతో సమావేశ మందిరంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఈ సందర్భంగా 15వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డి రమేష్ మాట్లాడుతూ డివిజన్లలో సమస్యల పరిష్కారంలో పాలకవర్గం విఫలమవుతోందని వ్యాఖ్యానించడంతో పరిస్థితి మరింత వేడెక్కింది.గత ఐదు నెలలుగా పాలకవర్గం అధికారంలో ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించలేదని పలువురు కార్పొరేటర్లు విమర్శించారు. దాదాపు పది నిమిషాల పాటు సమావేశం గందరగోళంగా సాగగా,ఇతర కార్పొరేటర్లు,పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను సముదాయించారు. అనంతరం పరిస్థితి సద్దుమణగడంతో సమావేశం తిరిగి ప్రారంభమైంది.ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రూ.83 కోట్ల వ్యయంతో ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.ఆ ప్రాజెక్టు పూర్తయితే నగరంలోని అన్ని డివిజన్లలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అలాగే డివిజన్లలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, కార్పొరేషన్ అధికారులు,డివిజన్ల కార్పొరేటర్లు ఆలకుంట్ల నాగరాజు,పెరికె యాద య్య, మల్లీశ్వరి పేర్ల, రత్నగిరి తారకమ్మ,పున్న జ్ఞానేశ్వరి, కుందూరు దీపిక, మారగోని భవాని, వజ్జా సంతోషిణి, బాణావత్ దీప్లా, పిల్లి కృష్ణంరాజు,పాలకూరి సుమలత,మామిడి క్రాంతికుమార్,గుమ్మల జానకి, శంకరయ్య పాల్గొన్నారు.



**రెండో డివిజన్ కార్పొరేటర్ పెరికె యాదయ్య సమస్యలపై బ్యానర్ ప్రదర్శన**

కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత

అభివృద్ధి నిధుల కేటాయింపుపై విమర్శలు

రూ.83 కోట్ల ఫిల్టర్ బెడ్ ప్రాజెక్టుతో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని మేయర్ హామీ

డివిజన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చిన పాలకవర్గం.





# వేగంగా సర్ ప్రక్రియ

### కలెక్టర్ చంద్రశేఖర్
### 94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

**ప్రజాపక్షం/నల్లగొండ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు,ఈఆర్వోలు,ఏఈఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,812 మంది బీఎల్‌ఓలను నియమించి కిట్లు, టీషర్టులు, క్యాపులు, ఐడీ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ప్రతి బీఎల్‌ఓకు అవసరమైన రెండు రకాల ఎన్యుమరేషన్ ఫారాలను అందించామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 94 శాతం ఫారాల పంపిణీ పూర్తయిందని, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందజేస్తున్నారని చెప్పారు. సాంకేతిక సమస్యలు లేవని, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ఫారాల పంపిణీ, సేకరణ వేగవంతం చేయాలన్నారు. బీఎల్‌ఓలు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫారాలు ఇచ్చి తిరిగి స్వీకరించాలని, విధుల్లో ఐడీ కార్డు, టీషర్టు, క్యాప్ ధరించాలని సూచించారు. ప్రతి ఫారంలో ఓటరు ఫోటో, సంతకం తప్పనిసరి అని, ఏఆర్వోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన పెంచాలని, నిర్ణీత గడువులోగా ఫారాల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనీ శ్రీకాంత్ రెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# ఉదయం ఉక్కపోత -రాత్రి కుండపోత

**ప్రజాపక్షం/నందికొండ :** కొద్ది రోజులుగా తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్న నాగార్జునసాగర్ ప్రజలకు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. రాత్రి ఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షం దాదాపు రెండు గంటలపాటు ఏక దాటిగా కురవడంతో పట్టణం పూర్తిగా తడిసిముద్దయింది.ఈ వర్షంతో 4.5సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.భారీ వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు కొంతసేపు అసౌకర్యానికి గురయ్యారు.సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.కొద్ది రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండిపోతున్న ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. అయితే ఉరుములు, మెరుపుల తీవ్రత కారణంగా రాత్రి వేళ కొంతసేపు ప్రజల్లో ఆందోళన నెలకొంది.



# మహిళా సాధికారత.. సొంతింటి కల సాకారం

### ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారతతో పాటు పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.ఆదివారం నకిరేకల్ మండలంలోని తాటికల్,వల్లభాపురం,ఓగోడు గ్రామాల్లో మహిళా సమాఖ్య సంఘ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి,నడిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పాలెం గ్రామానికి చెందిన బొంత బాలకృశివాణి దంపతులు, కడపర్తి గ్రామానికి చెందిన గిలకత్తుల సత్తయల్లయ్య దంపతుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సమాఖ్య భవనాలు మహిళల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉపయోగపడతాయని చెప్పారు. గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా ప్రభుత్వం అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు.పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పిస్తూ సొంతింటి కలను నెరవేరుస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారత, సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, నకిరేకల్ ఎంపీడీవో బ్రహ్మచారి,డీపీఎం మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుమాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, గాదగోని కొండయ్య, కోట మల్లికార్జున్, స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,సర్పంచులు,మహిళా సంఘ సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## శివలింగ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం లోని రామచంద్రపురం గ్రామంలో శివాలయం పునర్నిర్మాణం కార్యక్రమం శివలింగం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా సోమవారం జరిగింది. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో నిత్యం వర్ధిల్లాలని ఆ శివయ్యను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిలుగు సతీష్ పవన్, సర్పంచ్ కొలను రవికళ కృష్ణ, ఉప సర్పంచ్ ఎస్ చందు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎల్లంల జంగయ్య పాల్గొన్నారు.

## పనుల పురోగతి పరిశీలన



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం శివారెడ్డి గూడెం గ్రామంలో పలు అభివృద్ధి పనుల పురోగతిని ఆ గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి ఉపసర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్ తో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ నిధులతో గ్రామంలో నిర్మాణం జరుగుతున్న మహిళా భవనం, ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం భవనం, గ్రామ కమ్యూనిటీ హాల్ పనులు ఏ మేరకు పురోగతిలో ఉన్నాయని క్షేత్ర పరిశీలన చేశారు. పనుల నాణ్యత, పురోగతిని పరిశీలిస్తూ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని వారు తెలిపారు.

## ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

**ప్రజాపక్షం/హాలియా:** ప్రజలు సుఖ సంతోషాలతో పాడిపంటలతో ఆనందంగా గడపాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చల్మారెడ్డిగూడెంలో జరిగిన గంగమ్మ జాతర ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు.ఈసందర్భంగా గంగాదేవిని గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మ కరుణించి ప్రజలను చల్లగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి నీటి వనరులు పుష్కలంగా ఉన్నట్లయితే ప్రజలు పంటలు పండించుకుని ఆనందంగా జీవిస్తారని తెలిపారు.గంగమ్మ కరుణించి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో వర్షాలు ముమ్మరంగా కురవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు,చేగొండి కృష్ణ, కూరాకుల రవి, బాలయ్య, సురభి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేటు విద్యాసంస్థల అధిక ఫీజులను అరికట్టాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రైవేటు విద్యాసంస్థలు రకరకాల ఫీజుల పేరిట అధిక డబ్బులను దోచుకుని తల్లిదండ్రుల పాలిట పిల్లల చదువులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులు దీనిని అరికట్టకపోతే ఉద్యమం చేపడుతామని బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ హెచ్చరించారు. ఇందిరా నగర్ కాలనీ భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఆదివారం బహుజన ప్రజాశక్తి తలపెట్టిన విద్యా హక్కు చట్టం అమలు పరచాలని సమావేశం ఏర్పాటు చేశారు. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఎంఆర్పిఎస్ నాయకులు ఇందిరా నగర్ కాలనీ యూత్ సభ్యులు పాల్గొన్న సమావేశంలో విద్య హక్కు చట్టం కచ్చితంగా అమలుపరచాలినీ డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలనీ విద్యకు బడ్జెట్లో 25% శాతం నిధులు కేటాయించాలనీ ప్రైవేటు మరియు కార్పొరేటు విద్యాసంస్థలలో నూటికి 25% ఉచిత అడ్మిషన్లు ఎస్సీ ఎస్టీ బీసీలకు ఇవ్వాలను కోరారు. ఈ నెల నిర్వహించే లోనే ఇందిరాపార్కు వద్ద చేపట్టబోయే రిలే నిరాహార దీక్షలను కూడా జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని లేకుంటే ఈ ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో చెరుకు వెంకటేశం, కుక్క బాల నరసింహ, పెద్దల సుధాకర్, పోతగళ్ళ శ్రీను, కుక్క శివ, కుక్క లింగస్వామి, పోతగల్ల శ్రీధర్, పెద్దల సంజీవ, పెద్దల భాస్కర్, నల్ల యాదగిరి, నల్ల మహేందర్, కుక్క కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గ్రామీణ పేదల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న విబిజి రాంజీ బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 1న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపెల్లి సైదులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లా సదస్సులో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది నిరుపేద కుటుంబాలకు ఉపాధి, ఆదాయ భరోసా కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని అమలు పరచడంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు అధ్యక్ష వర్గంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకట నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లె వెంకట్ రెడ్డి వ్యవహరించిన సమావేశంలో నాయకులు శీలం శీను, వట్టపు సైదులు, పులుసు సత్యం, హుస్సేన్, స్వరాజ్యం పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే చేసి పోలియో డ్రాప్స్ వేస్తున్నాం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఇంటింటి సర్వే చేసి మరి పోలియో డ్రాప్స్ వేస్తున్నామని మండల వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనుకున్న దానికంటే ఎక్కువ మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు కార్యక్రమం విజయవంతమైనట్లు పేర్కొన్నారు. సోమవారం అనివార్య కారణాలవల్ల పోలియో డ్రాప్స్ వేసుకోకుండా మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పోలియో రహిత మండలంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. 35 పోలియో కేంద్రాలలో 3680 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వివరాలు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని పోలియో కేంద్రాలను ఆమె పర్యవేక్షించారు. కాగా నేడూ ఇంటింటికి సర్వే చేసి ఇంకా ఎవరైనా మిగిలిన పిల్లలు ఉంటే వారికి పోలియో చుక్కలు అందించనున్నట్లు చెప్పారు.



## ఎరువాక పౌర్ణమి వేడుకలు

**ప్రజాపక్షం/నడిగూడెం:** ఏరువాక పౌర్ణమి వేడుకలను మండల పరిధిలోని కరివిరాల ఆవాస గ్రామ వెంకట్రాంపురంలో సోమవారం సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలికట్టి, తొలకరి దుక్కి దున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని గో పూజలు నిర్వహించారు. పలువురు రైతులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారోతు పార్వతమ్మ, వార్డు సభ్యురాలు కైగూరి శాంతమ్మ, సిరిఫౌండేషన్ వ్యవస్థాపకులు మొలుగూరి గోపయ్య, రైతులు వెంకటచారి, రాఘవయ్య, పసణాల నాగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** జలమే జీవనాధారం, ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ సతీష్, సర్పంచ్ ధారావత్ వరలక్ష్మి వెంకటరమణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్ పేటతండాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హర్ ఘర్ జల్ జల్ అర్పాన్ దివస్ (జల మహోత్సవ) కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభన్‌వర్మ, ఉప సర్పంచ్ బాణోతు ప్రమీల, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ధారావత్ శ్రీను, బాణోతు బాలకృష్ణ, వార్డు సభ్యులు అమ్రు, వాంకడోతు కౌశల్య, బాణోతు వెంకన్న, తారాసింగ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.




## ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.10వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బిఆర్ఎస్‌వి) నాయకులు బంటు సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్.వి. డిగ్రీ కళాశాల ఎదుట ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు చదువుకి దూరం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖమ్మంపాటి ఉదయ్, దున్న చారంజన్, మహేందర్, బానోతు రామ్, చందు, వడ్లమూడి అరవింద్, అంజి, వంశీ పాల్గొన్నారు.

## నానో ఎరువుల వాడకంపై అవగాహన



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** భూసారాన్ని కాపాడటానికి, సంప్రదాయ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో ఎరువులు వాడాలని కెవికె శాస్త్రవేత్త డి.నరేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గారకుంటతండాలో ఖేత్ బచావో అభియాన్ (నేలలను రక్షించుకుందా) కార్యక్రమంలో భాగంగా నానో ఎరువుల వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోతుందని, వీటి వాడకాన్ని తగ్గించి ప్రతిరైతు తన భూసార పరీక్షలు చేయించుకుని భూమికి అవసరమైన పోషకాలు దీని ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయని, సుస్థిర వ్యవసాయం వాతావరణ మార్పులను తట్టుకుంటూ ఎక్కువ దిగుబడి సాధించే ఆధునిక పర్యావరణహిత వ్యవసాయ పద్దతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త ఎ.కిరణ్; ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎన్.సుగంది, ఇఫ్కో మేనేజర్ ఎ.వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ బాణోతు అరుణ, ఉప సర్పంచ్ గౌతమి సుధాకర్, హేమ్లానాయక్, నరేందర్‌నాయక్ రైతులు పాల్గొన్నారు.

## అల్పాహార వితరణ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రభుత్వ పాఠశాలలో ఒకనెల పాటు ప్రతి రోజు ఉదయం పూట అల్పాహారం అందిస్తానని దాత, వార్డు మెంబర్ ఎవిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కల్మల్ చెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెల పాటు విద్యార్థులకు అల్పాహారం అందిస్తానని ఆయన అన్నారు. ప్రధానోపాధ్యాయులు పిడమర్తి వీరబాబు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాత ఎవిరెడ్డి ముందుకు రావడం చాల సంతోషకరమన్నారు. వచ్చే నెల పాటు మాజీ సర్పంచ్ కూకూనూరి అంజయ్య, ఆ తర్వాత నెలలో ఎస్ఎస్‌పి 1988/89 సంవత్సర పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చినట్లు వీరికి పాఠశాల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాత ఉదయం విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. సర్పంచ్ బచ్చలకూరి శ్రీను, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ పాశం అరుణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## గంగాదేవి చెరువు శికం ఆక్రమణపై ఆర్‌డిఓకు వినతి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** కట్టంగూర్ మండలం బొల్లె పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 80లో ఉన్న గంగాదేవి చెరువు శికం భూమిని అక్రమంగా ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ రైతులు సోమవారం ఆర్‌డిఓ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజే శారు. సుమారు 20 ఎకరాల చెరువు శికం భూమిని కొందరు ఆక్రమించి కాల్వలు తవ్వి, కట్టలు వేయ డంతో ఎగువన ఉన్న తమ పట్టా భూములు ముంపు నకు గురవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్ర మణలను తొలగించి చెరువు శికం భూమిని పరిర క్షించి తమకు న్యాయం చేయాలని కోరారు.వినతిప త్రం అందజేసిన వారిలో గాధగొని సైదులు, బండ జానారెడ్డి, బెజవాడ శ్రీను,ఎర్ర ఉపేందర్, వర్రె లింగయ్య, వర్రె వెంకన్న, వరికుప్పల నాగరాజు, వర్రె నవీన్ తదితర గ్రామస్థులు ఉన్నారు.

## సాయిచంద్‌కు నివాళులు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పాటను ఆయుధంగా మార్చి ప్రజల హక్కుల కోసం పోరాడిన కళాకారుడు సాయి చంద్ అని, ఆయన శరీరం దూరమైన సాయిచంద్ పాటలు ప్రజల గుండెల్లో శాశ్వతంగా మార్మోగుతూనే ఉంటాయని బిఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సాయిచంద్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో బిఆర్‌ఎస్ నాయకులు గుగులోతు కృష్ణనా యక్, రామ్ సైదులు, తక్కెళ్ల నాగార్జున, పాండునా యక్, తావుర్యనాయక్ పాల్గొన్నారు.

## రక్తదానం చేసి... ప్రాణదాతలు అవ్వండి..



**ప్రజాపక్షం/హాలియా:** రక్తం అవసరం ఉండి ఆప దలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావా లని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ అన్నారు. సోమవారం హాలియాలోని సాగర్ రోడ్డులో హాలియా క్లబ్ మేడారం బ్యాచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాలియా కు చెందిన 100 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. సామాజిక సేవలో భాగంగా ఈ రక్తాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చిన యువతకు మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ బండి సాయి ప్రశాంతులు ప్రత్యేక అభినంద నలు తెలిపారు.

## అన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/భువనగిరి :** శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర ఆలయం చైర్మన్ కొల్లూరి రాజు ఆధ్వర్యంలో శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం నిత్య అన్నప్రసాద వితరణలో భాగంగా సోమవారం అన్న ప్రసాద దాతలు స్థానిక 12వ వార్డు కౌన్సిలర్ తోటకూర వెంకటేష్ విజయలక్ష్మి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నా ప్రసాద వితరణ కా ర్యక్రమం నిర్వహించారు. భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ శ్రీవాణి రవి కుమార్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.



# వసతి గృహాల్లో ఖాళీలు భర్తీ చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న నైట్ వాచ్మెన్, కుక్, కమాటి పోస్టులను తక్షణమే భర్తీ చేసి విద్యార్థులకు భద్రత కల్పించాలని పలు విద్యార్థి, సామాజిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం, బీసీ రాజ్యా ధికార సమితి, మాల మహానాడు ఆధ్వర్యంలో సోమ వారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్, బీసీ రాజ్యాధి కార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, మాల మహానాడు విద్యార్థి విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్‌లు మాట్లాడుతూ వసతి గృహాల్లో కీలక సిబ్బంది లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేకంగా నైట్ వాచ్మెన్ పోస్టులు ఖాళీగా ఉండ టంతో రాత్రి వేళల్లో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. హాస్టళ్లలో వందలాది మంది విద్యా ర్థులు నమోదై ఉన్నప్పటికీ రక్షణ సిబ్బంది లేకపోవ



డంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల కారణంగా పలువురు విద్యార్థులు హాస్టళ్లలో ఉండకుండా ఇళ్లకే పరిమితమ వుతున్నారని తెలిపారు. అదేవిధంగా కుక్, కమాటి పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల పరిశుభ్రత దెబ్బతిం టోందని, భోజన నిర్వహణలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైరం లక్ష్మీ నారాయణ, సైదానాయక్, మధు, పవన్, రాజేష్ పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల

**ప్రజాపక్షం/రామన్నపేట :** చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర సహకార సంఘం నోటిఫికేషన్ విడుదల చేయగా సోమవారం స్థానిక కాటన్ చేనేత సహకార సంఘంలో ఎన్నికల అధికారి కే.సురేష్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షులు జెల్ల వెంకటేష్‌కు ధ్రువీకరించిన ఓటర్ జాబితాను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై రెండు నుండి నాలుగు వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, జూలై ఐదున నామినేషన్ల పరిశీలన, ఆరున నామినేషన్ల ఉపసంహరణ తుది జాబితా ప్రక టించడంతోపాటు గుర్తుల కేటాయింపు ఉంటుంద న్నారు. జూలై 10న పోలింగ్ ఉంటుందని, మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. తుది ప్రకటన తర్వాత మూడు రోజుల్లోపు కార్యవర్గ ఏర్పాటు ఉంటుంద న్నారు.మొత్తం తొమ్మిది డైరెక్టర్లలలో ఏడు జనరల్, 2 మహిళలకు ఉంటాయన్నారు. నామినేషన్ ఫీజు 750



చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ అభ్యర్థి స్వయంగా ప్రతిపాదితులతో వచ్చి ఎన్నికల అధికారికి ఇవ్వాలని సూచించారు. ఈ షెడ్యూల్‌ను తహసిల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, గ్రామపంచా యతీ కార్యాలయాలలో కూడా ప్రదర్శనకు పెట్టడం అయిందని, ఓటర్లు ఓటర్ జాబితాను పరిశీలించవ చ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పెండం వేణు, కార్యదర్శి దొంత నాగరాజు, వనం నరసింహ, పెండెం భావన ఋషి, గంజి అశోక్, కైరంకొండ నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో 5న టిఆర్‌పి సభ



**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరిలో జూలై 5న నిర్వహించనున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్‌పి) మహాసభను విజయవంతం చేసి తెలం గాణ వ్యాప్తంగా పార్టీ బలాన్ని చాటాలని టిఆర్‌పి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరి జిల్లా కేంద్రంలో పలువురు బీసీ ప్రముఖులకు సభ ఆహ్వా నం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సభ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని, రాజ్యాధికార లక్ష్యాన్ని చాటిచెప్పే చారి త్రాత్మక సభగా నిలవాలని అన్నారు. జూలై 5న భువ నగిరి వేదికగా జరిగే ఈ సభతో తెలంగాణ దద్దరి ల్లేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని బంధారపు నర్సయ్య గౌడ్ పిలుపుని చ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన లక్ష్యాలతో ముందు కు సాగుతున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీకి ప్రజ లంతా అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, కార్యదర్శి ప్రవీణ్, రాజ్, సురేష్ పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్‌గా సిద్ధారెడ్డి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం దత్తాయ పల్లి గ్రామంలో ఎన్నికల అధికారి వనమాల గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా గొప్ప సిద్ధారెడ్డి ఎన్నుకున్నారు. నూతన డైరెక్టర్లుగా ఎద్దు భవాని, కొండం బాలరాజ్ గౌడ్ ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన పాల ఉత్పత్తిదారుల సభ్యు లకు, ధన్యవాధాలు తెలిపి పాలసంఘం అభివృద్ధి కి



మరింత కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మాధవరం కృష్ణ, మాజీ ఎంపిటిసి గిద్దే కరుణాకర్, సీనియర్ నాయకులు గుండ సత్తయ్య, దానబోయిన మల్లేష్, ఎద్దు వీరస్వామి, గుండ ప్రభాకర్ పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, Rc.no. 1228/ YDR/SCEA తేదీ 23.6.2026 ననుసరించి నోటీసు Rc.01/ 2026/నారాయణపురం/ఎలక్షన్స్, తేదీ 29.6.2026 ప్రకారం నారాయణపురం చేనేత సహకార సంఘం లిమిటెడ్‌కు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి కె.ప్రవీణ్ కుమార్ సోమవారం విడుదల చేశారు. చేనేత సహకార సంఘం భవనంలో పర్సన్ ఇన్చార్జి, మేనేజర్, చేనేత సహకార సంఘం సభ్యుల సమక్షంలో ఈ నోటిఫికేషన్ ను విడుదల చేశారు. తేదీ 2.7. 2026, 3.7.2026 మరియు 04.07.2026 లలో నామినేషన్ల స్వీకరణ, తేదీ. 5.7. 2026 నామినేషన్ల పరిశీలన, తేదీ 06.07. 2026 న నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికల గుర్తుల కేటాయింపు, తేదీ 10.07.2026 న పోలింగ్, మరియు ఫలితాల ప్రకటన. ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎన్నికల నోటిఫికేషన్‌లో ప్రక టించామని, సహకార సంఘం నోటీసు బోర్డుపై ప్రదర్శించామని ఆయన తెలియపరిచారు.

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌లో రజత పతకంతో మెరిసిన వనమాల శశాంక్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** హైదరాబాద్ నగరంలో అట్టహాసంగా జరిగిన 12వ యోనెక్స్ సన్‌రైజ్ అండర్19 స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో నల్లగొండ జిల్లాకు చెందిన వనమాల శశాంక్ రన్నరప్‌గా నిలిచి వెండి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. బ్యాడ్మిం టన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, హైదరాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది మేటి క్రీడాకారులు పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన ఈ అండర్19 విభాగం పోటీల్లో శశాంక్ తన అద్భుతమైన నైపుణ్యాలు, వ్యూహాత్మక ఆటతీరుతో ఫైనల్స్ వరకు దూసుకెళ్లి రజత పతకాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా, రాబోయే నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ తరపున ఆడేందుకు అర్హత సాధించాడు. శశాంక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల నల్లగొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ అంజయ్య, ప్రెసిడెంట్ డాక్టర్ ప్రశాంత్, సెక్రటరీ పి. నవీన్ కుమార్, జిల్లా కోచ్ రామకృష్ణ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభావం తులైన క్రీడాకారులు ఉన్నారని, శశాంక్ విజయం మిగతా యువ ఆటగాళ్లకు గొప్ప స్ఫూర్తినిస్తుందని వారు పేర్కొన్నారు.

## 104 సిబ్బందికి వేతనాలు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** దీర్ఘకాలికంగా వైద్యశాఖలో పనిచేస్తున్న 104 ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లిం చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటిండెంట్ పి. శ్రావణ్ కుమార్‌కు 104 సిబ్బంది సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 104 పథకం వల్ల ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఎమర్జెన్సీ సర్వీస్ అందించిన 104 సిబ్బందికి నెలల తరబడి వేతనాలు ఇవ్వ కపోవడం అన్యాయం అన్నారు. ఏప్రిల్ 15 నుండి కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వలేదని, రీ డిప్లాయ్‌మెంట్ కింద ఇతర జిల్లాల్లో పని చేస్తున్న సిబ్బందిని స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు మంజూరు చేయాలని ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఫైనాన్స్ శాఖ రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పడం అన్యాయమ న్నారు. జూలై 5 లోపు సమస్య పరిష్కారం కాకపోతే సమ్మెకు దిగు తామని అందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగు నాయక్, నాగలక్ష్మి , నాగమణి, సురేష్ పాల్గొన్నారు.





## అన్ని గ్రామాలకు ఉపాధి హామీ నిధులను మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి** : గ్రామాల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసిన ఉపాధి హామీ నిధులను అన్ని గ్రామాలకు మంజూరు చేయాలని జాజిరెడ్డి గూడెం మండల సర్పంచులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను బిఆర్ఎస్ సర్పంచులు కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో 17 గ్రామ పంచాయితీలలో 8 గ్రామ పంచాయితీలకు మాత్రమే సిసి రోడ్ల నిర్మాణం కోసం కోటి రూపాయలు విడుదల చేశారని తెలిపారు. బిఆర్ఎస్ సర్పంచులు ఉన్న 9 గ్రామాల పట్ల అధికారులు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వల్లపు గంగయ్య, కర్నాటి వెంకన్న, మేడి వీరస్వామి, బానోతు సైదులు, అంకిరెడ్డి వీరాంజనేయులు, శైలేందర్, యాదగిరి, బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

## సేవలకు అవార్డు



**ప్రజాపక్షం/తుంగతుర్తి** : ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిస్టిక్ హెల్త్ క్యాంప్ చైర్‌పర్సన్‌గా సేవలందించిన లయన్ జలగం రామచంద్రన్ గౌడ్‌కు, డాక్టర్ మురళీధర్, మంద పద్మారెడ్డికి డిస్టిక్ గవర్నర్ డాక్టర్ ఆర్య చేతులమీదుగా డిస్టిక్ ఎక్సలెంట్ లీడర్షిప్ అండ్ సర్వీసెస్ అవార్డును సోమవారం హనుమకొండలోని గ్రీన్ గార్డెన్స్‌లో అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు విజేతలు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామని అలాగే ఈ అవార్డు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ రమేష్ నాయక్, లయన్ సుందర్, లయన్ ఇమ్మడి వెంకటేశ్వర్లు, లయన్ అయిత శ్రీనివాస్, లయన్ డాక్టర్ పూర్ణచందర్, లయన్ చింతకింద మురళీ పాల్గొన్నారు.

## కొండేటి నర్సిరెడ్డి సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : కొండేటి నర్సిరెడ్డి పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దోసపహాడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండేటి బిక్షం రెడ్డి తండ్రి కొండేటి నర్సిరెడ్డి దశదిన కార్యక్రమానికి ఆయన హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొండేటి బిక్షం రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు, మార్కెట్ డైరెక్టర్ ఎం. దామోదర్ రెడ్డి, సర్పంచులు అనుములపూరి నాగయ్య పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ ప్రసాంత చంద్ర జయంతి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : భారతదేశ ప్రఖ్యాత గణాంక శాస్త్రవేత్త, పద్మవిభూషణ్ ప్రొఫెసర్ ప్రసాంత చంద్ర మహలనోబిస్ జయంతిని పురస్కరించుకొని 20వ జాతీయ గణాంక దినోత్సవం 2026 కార్యక్రమాన్ని సోమవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి)లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ దేశంలో ఆధునిక గణాంక వ్యవస్థకు పునాది వేసిన మహనీయులని, ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణాంకాల ప్రాముఖ్యత, సమర్థవంతమైన ప్రణాళిక రూపకల్పనలో విశ్వసనీయ డేటా పాత్ర, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో అధికారిక గణాంకాల అవసరం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో గణాంకాల పాత్ర అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. ప్రేమ్‌రాజు, ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్. కిషన్, డిటిడబ్లుఓ శంకర్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిపిఓ యాదగిరి, గణాంక అధికారులు పి. రమేష్, వి. రామారావు, ఉప గణాంక అధికారులు రాజేష్, కోటేశ్వరరావు, నరేందర్, లింగయ్య, అశోక్, పర్యవేక్షకులు దున్న శ్యామ్, మండల ప్రణాళిక, గణాంక అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల దీవెనతో సిఎం సభ విజయవంతం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే ఆదర్శ పాలన అందిస్తూ సంక్షేమ పథకాలను అమలు అమలు చేస్తున్నారని ప్రజలు మరోసారి ఆదరిస్తారని నల్లగొండ డిసిసి అధ్యక్షుడు పున్న కైలాసనేత ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు.సోమవారం పట్టణంలోని యాదవ్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం నల్లగొండలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి సభ విజయవంతం అయ్యిందని దీనిని విజయవంతం చేసినా జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సభకు భారీగా హాజరైన నల్లగొండ మహిళ సోదరీమణులకు ఆకాంక్ష మేరకు సీఎం రేవంత్ రెడ్డి వారి పక్షపాతిగా నిలబడ్డారని ఆదర్శపాలన అందిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ మరోసారి తెలంగాణ ప్రజలు ఆదరిస్తారని అన్నారు. పది సంవత్సరాలుగా కేసీఆర్ పాలనలో జిల్లాకు చేకూరిన ప్రయోజనం శూన్యమని నేటి రెండున్నర సంవత్సరాలుగా పాలనలో వేల కోట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రిది అన్నారు. ఎస్ ఎల్ బి సి టన్నెల్,నెల్లికల్, కిష్టరాంపల్లి రిజర్వాయర్,బ్రాహ్మణ వెల్లంల,చర్లగూడెం రిజర్వాయర్, లను పూర్తి చేయకుండా నల్లగొండ రైతులను వంచించిన బిఆర్ఎస్ నేడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరం అన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ సెల్ చైర్మన్ జిల్లపల్లి పరమేష్,ఎండి ముంతాజ్ అలీ,మేకల రాజేందర్ రెడ్డి,దామనూరి అశోక్, చర్లపల్లి గౌతం, పగిళ్ల రాజు, వేముల గోపీనాథ్, వెంకటరత్నం, గుర్రం కోటేష్, ఎండి అజీస్,సయ్యద్ నాగుల్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# 140వ ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/బీబీనగర్** : బీబీనగర్ పట్టణంలోని భవిష్ డయాగ్నొస్టిక్ సెంటర్ నందు శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం (29/06/2026) ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న 'పల్లె పల్లెకి వైద్యం' కార్యక్రమంలో భాగంగా ఇది 140వ ఉచిత వైద్య శిబిరం కావడం విశేషం. ఈ శిబిరంలో బీబీనగర్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చావా రాజ్ కుమార్ (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ చావా అశ్లేష (దంత వైద్య నిపుణులు) ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ తగిన సూచనలు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అభినందించారు. అనంతరం డాక్టర్ల సలహా మేరకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పలువురు డాక్టర్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులు సుఖ సంతోషాలతో ఉండాలి

**ప్రజాపక్షం/మునగాల**: విశ్రాంత ఉద్యోగులు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు శాఖమూడి అప్పారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సామూహిక జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలలో ఉద్యోగుల జన్మదిన వేడుకలను నిర్వహించడం అనవాయితీగా చేసుకుంటున్నామని, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మా సంఘం అన్ని విధాలుగా పోరాటాలు నిర్వహిస్తామని కోరారు. విశ్రాంత ఉద్యోగుల జన్మదిన సందర్భంగా పిఎల్ తులశమ్మ, ఎన్.గోపాల్‌రెడ్డి, జెట్టి రామిరెడ్డి, ఎండి ఖాజామొయినుద్దీన్, కె.సంజీవరావులను ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బుచ్చారెడ్డి, ఎస్. కృష్ణయ్య, రవి, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.





## గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గ్రామంలో మహిళా సమైక్య సంఘం నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన సర్పంచ్ గట్టు జ్యోతి శ్రీనివాస్‌తో కలిసి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సమైక్య సంఘాల బలోపేతం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వం మహిళల స్వయం సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, ఇటువంటి మౌలిక సదుపాయాలను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మహిళలకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సౌకర్యవంతమైన భవనం అందుబాటులోకి రానుందని తెలిపారు.

## ముగ్గురు పిల్లల అనర్హత నిబంధనతో తీవ్ర అన్యాయం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** :ఎమ్మెల్యే ఎంపీ మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు లేని ముగ్గురు పిల్లల అనర్హత నిబంధన చేనేత సహకార సంఘాలకు ఎందుకు అమలు పరుస్తున్నారని ప్రభుత్వం తప్పుడు నియమాన్ని పెట్టి యువకులకు పోటీ చేసే అవకాశం అందకుండా చేస్తున్నారని చాలా అన్యాయమని బిఆర్ఎస్ పార్టీ కీలక చేనేత కార్మిక నాయకుడు భారత గిరివాసు తీవ్ర ఆవేదనను వెలిబుచ్చారు. సోమవారం చేనేత సహకార సంఘ ఎన్నికల నోటీసు ప్రకటన వెలువడిన దరిమిలా ఆయన ప్రజాస్వామ్యతంగా అందరికీ సమాన అవకాశాలు దక్కాలని ఉద్దేశంతో అన్ని స్థానిక స్థానికేతర ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు పిల్లల అనర్హత నిబంధనను ప్రభుత్వం తొలగించి స్వేచ్ఛను ప్రసాదించిన విషయం గుర్తు చేశారు. అలాంటప్పుడు కేవలం సహకార సంఘాలకు మాత్రమే ఈ నిబంధనను ఎందుకు అమలు చేస్తున్నారని కొందరు నేతలను రాజకీయంగా ఎదగకుండా చేసేందుకే కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అక్రమంగా చేపలు పట్టడంపై అధికారుల విచారణ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అక్రమంగా చేపలు పట్టడంపై అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. మండలంలోని తాళ్లమల్కాపురం గ్రామ గరుడ సముద్రం చెరువులో అక్రమంగా చేపలు పట్టడంపై మత్స్యశాఖ అధికారులు విచారణ జరిపారు. గురు, శుక్ర, శనివారం మూడు రోజుల్లో సుమారు 150 టన్నుల చాపలు, రెండు కోట్ల విలువ చేసే చేపలు అక్రమంగా పట్టుకున్నారంటూ జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఈ విచారణ చేపట్టారు. కాంట్రాక్ట్ ముసుగులో ఉన్న దళారులు, చెరువు సోసైటీ చైర్మన్, సెక్రటరీ, ఉపాధ్యక్షుడు సిండికేట్‌గా ఏర్పడి చెరువు సోసైటీ సభ్యుల పొట్టా కొట్టారని చెరువు సోసైటీ పాలకవర్గ సభ్యులు మండవ వెంకటేశ్వర్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయమై జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయ స్వామి అదేశాల మేరకు మత్స్యశాఖ అధికారి ఉపేందర్ విచారణ చేపట్టారు. తాళ్లమల్కాపురం గ్రామ పంచాయతీ వద్ద చెరువు సోసైటీ సభ్యులతో విచారించారు. సోసైటీ సభ్యుల నుంచి ఆయన అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజి మత్స్యశాఖ బాణోతు బంగ్య, చెరకు వెంకటేశ్వర్లు, సివినేని బాలస్వామి, సోసైటీ సభ్యులు పాల్గొన్నారు.

**మత్స్యశాఖ అధికారి వివరణ**

తాళ్లమల్కాపురం చెరువు సోసైటీపై విచారణ జరిపిన అధికారి ఉపేందర్ మాట్లాడుతూ చెరువులో చేపలు పట్టేందుకు మత్స్యశాఖ అనుమతి ఉందని, సోసైటీలో రెండు వర్గాలు ఉండటంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నాయని మరోసారి పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేస్తామని అన్నారు.





## సిసిరోడ్ల నిర్మాణం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండలంలోని ఎర్రగట్టు తండా గ్రామంలో సోమవారం సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో ఈ పనులు జరుగుతాయని ఆ గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ఉపాధి హామీ నిధుల ద్వారా ఐదు లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామంలోని బాణోతు సక్కు పొలం నుండి శ్మశాన వాటిక వరకు రోడ్డు నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోషిన్, ఉప సర్పంచ్ బాణోతు సైది పాల్గొన్నారు.

## ఆలయంలో సంప్రోక్షణ

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వాయిల సింగారం గ్రామంలో శ్రీగంగా సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సంప్రోక్షణను కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆలయ పురోహితులు సూర్యనారాయణ ఆధ్వర్యంలో బ్రహ్మణుల చేత ఆలయశుద్ధి కార్యక్రమాన్ని, హోమ గుండం ఏర్పాటు చేసి హోమం నిర్వహించారు. స్వామి వారికి 9 కలిశాలల తొమ్మిది రకాల వివిధ పానియాలతో అభిషేకం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవాలయలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాతలు బుర్ర సైదులు, పెద్దగొల్ల బుర్ర సతీష్, వీరబోయిన వెంకటేశ్వర్లు, నాగరాజు, రామారావు పాల్గొన్నారు.

## గ్రామశాఖ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇమ్మడి దశరథగుప్త ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కమిటిని ఎన్నుకున్నారు. నూతన గ్రామశాఖ అధ్యక్షులుగా బోరం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మొగిలిపాక రామ్‌నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కాళి మల్లేష్, కార్యదర్శిగా వామన, కోశాధికారిగా శేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా చెన్నూరి గోపికృష్ణ, ఉపాధ్యక్షులుగా శంశీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మధన్మోహన్, బిసి సెల్ అధ్యక్షులుగా శ్రీశైలం, సోషల్ మీడియా కన్వీనర్‌గా కృష్ణలను ఎన్నుకున్నారు.

## పాల సంఘం చైర్మన్‌గా మాధవరెడ్డి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామ పాల సంఘం చైర్మన్‌గా సోమవారం మలిపెద్ది మాధవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన చైర్మన్ మాధవ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పాల సంఘం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లుగా దశరథ, శంకరయ్యలను ఎన్నుకొగా బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మౌలాల్, మాజీ ఎంపిటిసి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు.సోమవారం పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతి,లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలు, నిర్మాణ సామగ్రి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబం ప్రభుత్వ పథకం ప్రయోజనం పొందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాలని ఆయన సూచించారు. నాణ్యతతో రాజీ పడకుండా ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని, పనులు నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి రాజ్ కుమార్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆర్‌టిసి ఆర్‌ఎం జ్యోత్నకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆర్‌టిసి నల్లగొండ రీజినల్ మేనేజర్(ఆర్‌ఎం)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన టి.జ్యోత్నను సోమవారం నల్లగొండ రీజియన్ ఎస్‌సి,ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఆమెకు శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ముఖ్య సలహాదారు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ,ఉద్యోగుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి నూతన ఆర్‌ఎం జ్యోత్న సమర్థవంతమైన నాయకత్వం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో ఆమె విశేష కృషి చేస్తారని పేర్కొన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు కె.వి చంద్రకళ, అదనపు ప్రధాన కార్యదర్శి కడియం రమేష్, రీజియన్ కమిటీ అధ్యక్షుడు కొర్ర లింగానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు జానకి రాములు, కార్యదర్శి పి. యాదయ్య,డిప్యూటీ కార్యదర్శి వంటెపాక అనిల్ పాల్గొని నూతన ఆర్‌ఎంకు అభినందనలు తెలిపారు. మిర్యాలగూడ డిపో అధ్యక్షుడు దైద బాల,కార్యదర్శి డి.భాగ్యరాజు,నార్కట్‌పల్లి డిపో అధ్యక్షుడు బి.రామచంద్రం,కార్యదర్శి వేణుగోపాల్, విజయభాస్కర్,అనిల్ కుమార్, యాదయ్య ఆర్‌ఎం జ్యోత్నకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాంపల్లిలో పందుల స్వైర విహారం



**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని మార్కండేయ కాలనీ,దేవాలయం పరిసర ప్రాంతాల్లో పందులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలం కావడంతో పిల్లలు,మహిళలు,వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు.శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పందులు స్థావరాలుగా మార్చుకోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మలమూత్రాలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పందుల యజమానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని,ఇదే పరిస్థితి కొనసాగితే వర్షాకాలంలో పిల్లలకు మెదడు వాపు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.మండల అధికారులు వెంటనే స్పందించి పందుల బెడద నివారించాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

# కౌంటింగ్‌లో ఉద్రిక్తత

### వాయిదా పడిన ప్రక్రియ



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని తిమ్మాపురం పాలకేంద్రం ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ ప్రక్రియ ముగిసి రెండు గంటలు గడిచినా ఓట్ల లెక్కింపు ప్రారంభం కాకపోవడంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో పాలకేంద్రం పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపిపి మారిపెద్ది భవాని మాట్లాడుతూ స్థానిక సిఐ నాగేశ్వరరావు ఎన్నికల నిర్వహణలో పక్షపాత ధోరణితో వ్యవహరించారని ఆరోపించారు. పోలింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ బాక్సులను అధికార పార్టీ నాయకులకు అప్పగించారని విమర్శించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు సిఐ నాగేశ్వరరావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అలస్యం చేయకుండా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అధికారులను కోరారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో అదనపు పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఇరువర్గాల నాయకులతో పోలీసులు చర్చలు జరుపుతూ శాంతిభద్రతలను కాపాడే ప్రయత్నం చేశారు. ఆరోపణల నిజానిజాలు విచారణ అనంతరం మాత్రమే తేలే అవకాశం ఉంది. 56 ఓట్లకు గాను 55 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల అధికారి మల్లయ్య, డిఎస్‌పి ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## 4న వంగవీటి జయంతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దివంగత ప్రజా నాయకులు వంగవీటి మోహనరంగా జయంతికి మున్నూరు కాపులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వంగవీటి రంగా యువసేన అధ్యక్షులు నిమ్మకాయల ప్రవీణ్ నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 4న ఎన్‌టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో జరిగే దివంగత ప్రజా నాయకుడు వంగవీటి రంగా జయంతి నిర్వించనున్నందున వంగవీటి రంగా యువసేన నాయకులు, రంగా అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు కాసుల సత్యం, బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, తిరుమలగిరి అంజి, దుండిగల మధునాయుడు, బత్తుల సంపత్, కటికం గోపినాయుడు పాల్గొన్నారు.

## అక్రమ పట్టా మార్పిడిపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/కోదాడ:** తమపేర పట్టా ఉన్న భూమిని వేరే వ్యక్తికి రెవిన్యూ అధికారులు మార్పిడి చేశారని, ఈ అంశంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోదాడ మున్సిపాలిటి పరిధిలోని శ్రీరంగాపురం గ్రామవాసి పల్లా సీతరామాంజనేయులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై పలుమార్లు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. తన గోడును తెలియజేస్తూ రెవిన్యూ మంత్రి కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పెండింగ్ ముటేషన్ పేరుతో ఈ అక్రమం జరిగిందని, విచారణ చేస్తే వెలుగులోకి వస్తాయని తెలిపారు. ఉద్దేశ్యపూర్వంగానే తన సమస్య పరిష్కరించడం లేదని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ ఇప్పటి వరకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. తక్షణమే తమరు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని సీతారామాంజనేయులు కలెక్టర్‌ను కోరారు.

## ఓట్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/వేములపల్లి:** సర్ ఓట్ల నమోదు లో బిజెపి కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంటు సైదులు బిజెపి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం మండలంలోని పలు బూత్ లలో స్థానిక బిజెపి నాయకులతో పాటు బిఎల్ఓ లతో కలిసి నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పర్యటించేటప్పుడు 2002 ఓటర్ల జాబితాను ఓటర్లకు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఓట్ల నమోదు విషయంలో బిజెపి కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఓట్ల అవకతవకలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పెదమాం భరత్ మాజీ మండల అధ్యక్షులు ధూపాటి మట్టయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు బుల్లెట్ లావయ్య ఉన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని రామ్‌రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.దాత రామాంజనేయ గౌడ్,సర్పంచ్ లప్పంగి నరసింహాతో కలిసి విద్యార్థులకు బ్యాగులు అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మాజీ సర్పంచ్ నక్క వెంకటయ్య, కారింగు నరసింహ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి దానం సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని, భవిష్యత్తులోనూ మరెన్నో సహాయ సహకారాలు అందించాలని వక్తలు కోరారు.



## ప్రత్యేక పూజలు, అన్నదానం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** : మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధిలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.సోమవారం దేవస్థాన అర్చకులు బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి అనంత చార్యులు శ్రీగోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.అన్నప్రసాద కార్యాలయ నిర్మాణ దాతలు,ప్రారంభకులు శ్రీమతి గడగోజు యాదమ్మ,శంకరయ్య అన్నప్రసాద వితరణను ప్రారంభించారు.

## చేనేత సహకర సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

**ప్రజాపక్షం/గుండాల;** చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి సోమవారం రాష్ట్ర సహకార సంఘంలో ఎన్నికల అధికారి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 10న పోలింగ్ ఉంటుందని జులై 02 నుండి 4వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని జులై 05వ తేదిన నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటనతో పాటు గుర్తుల కేటాయింపు ఉంటుందని తెలిపారు. జులై 10న పోలింగ్ మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు. గుండాల మండలంలో మొత్తం 9 స్థానాలకు గాను 7 జనరల్, 2 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు.

## సహకార రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని శివన్నగూడ రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు.శ్రేయస్సు నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సంఘం చైర్మన్ బాల్యం నరసింహ మాట్లాడుతూ సహకార రంగాన్ని బలోపేతం చేయడమే మా ప్రధాన లక్ష్యం.రైతుల సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుంది. సభ్యులందరూ సహకార స్ఫూర్తితో ముందుకు సాగాలి అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఈఓ మధు గౌడ్, డైరెక్టర్లు యాదగిరిరావు, పాలక వర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల్లో అసంతృప్తి

**ప్రజాపక్షం/నకిరేకల్** :రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్ అన్నారు. సోమవారం నకిరేకల్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో 28న జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి అంశాలను ప్రస్తావించకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడం బాధాకరమన్నారు.

## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు ప్రాధాన్యత

### కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : డిండి,దున్నపోతుల గండి తదితర సాగు నీటి ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు.ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని,సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.పెద్ద శాఖల్లో 5కు మించి,చిన్న శాఖల్లో అసలు ఫిర్యాదులే పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో యూరియా కొరత రాకుండా చూడాలని,వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు,తహసీల్దార్లు,ఎంపీడీవోలు సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని, వచ్చే నెల మొదటి వారంలో ఫుడ్ సేఫ్టీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 65,ఇతర శాఖలకు 41 కలిపి మొత్తం 106 ఫిర్యాదులు వచ్చాయి.కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,డీఆర్ఓ దశరథ్,డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి,జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనీ శ్రీకాంత్ రెడ్డి,గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కెజిబివి పాఠశాలలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** కేజీబీవీ పాఠశాలలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి, మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యార్థులకు కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (KGBV) స్పెషల్ ఆఫీసర్స్ తో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా విద్య శాఖ అధికారి బిక్షపతి తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాఠశాలలల్లో ఇంకా పూర్తికాని పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పెండింగ్లో ఉన్న నిర్మాణ, మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి రుచికరమైన ఆహారం అందించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కాంపౌండ్ వాల్స్, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనులలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అసంపూర్తి రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.సిపిఐ,బిఆర్ఎస్,బిజెపి,సిపిఎం,టిడిపి,భీమ్ ఆర్మీ,మాల మహానాడు పార్టీల నాయకులు ఈసమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు అవుతున్నా రోడ్డు పనుల్లో ఒక్క తట్ట మట్టి కూడా వేయలేదని విమర్శించారు.రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సొంత మండలంలోనే పనులు చేయకుండా కాలం గడుపుతున్నారని ఆరోపించారు.నల్లగొండ చౌరస్తాలో గత కొంతకాలంగా జరుగుతున్న ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారని,రోడ్లపై గుంతల కారణంగా బైక్‌లపై నుంచి పడి ఎంతోమందికి కాళ్లు, చేతులు విరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుమర్తి యాదయ్య అధ్యక్షతన జరి



గిన ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంపటి శ్రీనివాస్,బిజెపి మండల అధ్యక్షులు మేడబోయిన శ్రీనివాస్,సిపిఎం మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, టిడిపి జిల్లా నాయకులు లింగాల యాదయ్య,భీమ్ ఆర్మీ జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి నాగరాజ్, బిఆర్ఎస్ నాయకులు చిరుమర్తి ఉపేందర్,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లి పరమేష్,ఎంపీటీసీ దుబ్బాక శ్రీధర్,కోఆప్షన్ సభ్యుడు వాజిద్,చిరుమర్తి సైదులు,ఆమనగంటి ఐలయ్య,కొప్పు శ్రవణ్,జాల యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ధ్వజస్తంభ ప్రతిష్ఠతో ఆధ్యాత్మిక వైభవం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, వేద పండితులు నిర్వహించిన పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆలయానికి మరింత వైభవాన్ని తీసుకువచ్చిందని పలువురు భక్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషనవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి,పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** చట్టబద్ధమైన విధానంలో ప్రతి పిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుండి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పిని కలిసి వినతులు సమర్పించారు. ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## సిఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ పర్యటన ద్వారా ప్రజలకు ఒరిగిందేమీ లేదని,హ్యామ్ రోడ్ల శంకుస్థాపన మంత్రి కోమటిరెడ్డి జిమ్మిక్కేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేప వెంకట్ రెడ్డి ఆరోపించారు.సోమవారం నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు నల్లగొండలో జరిగిన ముఖ్యమంత్రి సభ దేనికొరకో అర్థం కాలేదని,ఎంతో ఆశపడ్డ ప్రజలకు మరోసారి మొండిచెయ్యి చూపారని విమర్శించారు.సీఎం సభ సందర్భంగా వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో పాటు చివరికి కాంగ్రెస్ కార్యకర్తలను కూడా నిర్బంధించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బడుపుల శంకర్, మాజీ ఎంపీపీ నారబోయిన బిక్షం,మాజీ జెడ్పిటీసీ తుమ్మల లింగస్వామి, మాజీ సర్పంచులు కోట్ల జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే విద్యాసాగర్

### జన్మదిన వేడుకల్లో నేతి హాట్ కామెంట్స్..

### 50 ఏళ్లుగా పార్టీ కోసం పని చేశా..

### నేను లేకుండా నకిరేకల్‌లో కాంగ్రెస్ లేదు

**ప్రజాపక్షం/నకిరేకల్** : తెలంగాణ రాష్ట్ర శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ జన్మదిన వేడుకలు సోమవారం నకిరేకల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నేతి విద్యాసాగర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించాను.కాంగ్రెస్ అంటేనే విద్యాసాగర్.. విద్యాసాగర్ అంటేనే కాంగ్రెస్. నకిరేకల్ నియోజకవర్గంలో నేను లేకుండా కాంగ్రెస్ పార్టీ లేదు అని పేర్కొన్నారు. ఇటీవల పార్టీలో చేరిన కొందరు తమను సీనియర్ నాయకులుగా చెప్పుకోవడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. తమకు తెలియకుండా కార్యక్రమాలు నిర్వహించవద్దని చెప్పే హక్కు ఎవరికీ లేదని,పార్టీ ఎవరి జాగీర్ కాదంటూ వ్యాఖ్యలు చేశారు. నేను ఎప్పుడైనా ఎవరి వద్దైనా డబ్బులు అడిగానని,లంచం తీసుకున్నానని ఆధారాలతో రుజువు చేస్తే ముక్కు నేలకు రాసి రాజకీయాల నుంచి తప్పుకుంటాను అని సవాల్ విసిరారు.నేతి విద్యాసాగర్ చేసిన ఈ వ్యాఖ్యలతో నకిరేకల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.జన్మదిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, కట్టంగూర్ మాజీ జెడ్పీటీసీ సుంకరబోయిన నరసింహ యాదవ్,నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్య



క్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మాదా లింగస్వామి,నాయకులు జట్టంగి వెంకట్ నర్సు యాదవ్ పాల్గొన్నారు.

# నిబద్ధతతో శ్రమిస్తే ముందుకు....




## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

## దేశ చరిత్రలో సైనికుల త్యాగం మరువలేనిది

## బిసి కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభ-రణం కృష్ణమోహన్ రావు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** విద్యార్థి దశలోనే నిబద్ధతతో శ్రమించి లక్ష్యంతో ముందుకు సాగితే జీవితంలో సాధించలేనిది ఏమీ లేదని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మనిషి జీవితంలో విద్యార్థి దశ మహోన్నతమైనదని ఈ సమయంలోనే నిష్టతో ఎదగాలని ఐలయ్య సూచించారు. బొమ్మలరామారం మండలం రంగాపూర్ గ్రామ పరిధిలో ఉన్న హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల పాల్గొని ప్రసంగించారు. డిఫెన్స్ అకాడమీ కళాశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నారని ఇక్కడి విద్యార్థులు దేశవ్యాప్తంగా అనేక ఉన్నత అవకాశాలతో గొప్పగా ఎదుగుతుండడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు.లక్ష్యం లేకుండా చదువు కొనసాగించడం నిరర్ధకమని స్పష్టమైన ఆలోచనతో విద్యార్థి దశ నుండే సంకల్పంతో ముందుకెళ్లాలని ఆయన సూచించారు.డాక్టర్ వకుళాభరణం ప్రసంగిస్తూ.... డిఫెన్స్ అకాడమీలో ఇంటర్ మీడియట్ పాఠ్యాంశాలతో పాటుగా, అదనంగా ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ మున్నగు శాఖలలో ఉన్నత ఉద్యోగాల నిమిత్తం ప్రత్యేక శిక్షణ కోర్సులు అందజేయడం గొప్పగా ఉంది అన్నారు. ఇక్కడి విద్యార్థులు దేశవ్యాప్తంగా ఇప్పటికే పలు కీలక ఉద్యోగాలను సాధించడం గమనించదగింది అన్నారు. ఉద్యోగరీత్యా నిబద్ధతతో దేశ రక్షణ అంశంలో ఆయా శాఖ ల ఉద్యోగులుగా చేస్తున్న కృషి గొప్పది అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కోరే రాజ్ కుమార్, అకాడమీ డైరెక్టర్ నవ్య శ్రీ, చీఫ్ మెంబర్ రామకృష్ణ, ఆర్కే రావు ప్రిన్సిపల్ అంజయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంతోపాటు మల్యాల ధర్మారెడ్డి గూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజల సంతోషమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులు అవసరమని ఆయన అన్నారు. ప్రజల శ్రేయస్సు కొరకు నిరంతరం పనిచేయడమే తన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు కళ, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దాసరి సూర్య ప్రకాష్ రెడ్డి, మల్యాల సర్పంచ్ దొమ్మాట రమాదేవి శంకర్, కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్, సింగిర్తి మల్లేశం, సునీత పాల్గొన్నారు.



# రోకలిబండతో తల్లిని చంపి..

## తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కొడుకు





**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కుటుంబ కలహాలు భూతగాదాలతో మద్యం మత్తులో రోకలి బండతో తల్లిని చంపి తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కొడుకు దారుణమైన విషాద సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం పెద్ద రావులపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం తల్లిని చంపిన నిందితుడు మృతుడు సంగెం శ్రీను (46) గత కొన్ని సంవత్సరాల నుంచి డ్రైవింగ్ చేస్తూ హైదరాబాదులో నివాసం ఉంటున్నాడు. అనారోగ్య కారణాలతో ఆపరేషన్ జరిగి ఉద్యోగం మానేసి ఖాళీగా ఉంటున్నాడు. మద్యానికి బానిస అయ్యి తన భార్య పద్మతో తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. కొన్ని రోజుల క్రితం తీవ్ర మనస్థాపానికి గురైన తన భార్య భర్త ఆగడాలు తట్టుకోలేక తన అత్త మృతురాలు పోశమ్మ ఉంటున్న పెదరావులపల్లికి వచ్చింది. మృతుడు కూడా తన సొంత గ్రామానికి వచ్చాక భూతగాదాలలో వచ్చిన వివాదాలతో ఇంట్లో ఆదివారం భార్యతో గొడవపడి తలపై బలంగా కొట్టడంతో గాయాలపాలై ఆసుపత్రిలో చేరింది. విచక్షణ కోల్పోయిన మృతుడు శ్రీను తన తల్లి పోశమ్మ (90)పై విరుచుకుపడి రోకలిబండతో తలపై గట్టిగా మోదాడు. దీంతో వృద్ధురాలు అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి చనిపోయింది. ఏం చేయాలో తోచక తాను ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన గ్రామంలో ఉన్న అందరికీ తెలిసి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించే పనులు పడ్డారు. భూతగాదాలు ఇంట్లో కలహాలతో ఇరువురు తల్లీ కొడుకులు మృతి చెందిన విషయం తీవ్ర కలకలం రేపింది. ఎస్సై భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శవాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బోగారం చేనేత సహకార సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



**ప్రజాపక్షం/రామన్నపేట :** బోగారం చేనేత సహకార సంఘం ఎన్నికల సందర్భంగా ఎన్నికల అధికారి అంజయ్య నోటిఫికేషన్ను విడుదల చేసి, ఓటర్ల జాబితాను అడ్వైజర్ కమిటీ అధ్యక్షులు కోడి పాండునాథ్ కి అందజేశారు. నామినేషన్లు 02/07/2026 నుండి 04/07/2026 వరకు, నామినేషన్ ఫీజు: BC రూ.750/ నామినేషన్ల పరిశీలన 05/07/2026, నామినేషన్ల ఉపసంహరణ & తుది జాబితా: 06/07/2026, ఎన్నికలు (పోలింగ్): 10/07/2026, ఫలితాల ప్రకటన అదే రోజు ఉంటుందని, ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అంజయ్య ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సభ్యులకు సూచించారు. సంఘ సభ్యులంతా నిర్ణీత తేదీల్లో ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.



## 1న జరిగే ఎఐటియుసి చండూరు మండల మహాసభ ను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/చండూరు:** జూలై 1వ తేదీన జరిగే ఏ ఐ టియు సి చండూరు మండల మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ వివిధ రంగాల కార్మికులకు ఏఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు దోటి వెంకన్న ,జెల్ల శ్రీను పిలుపునిచ్చారు. సోమవారం చండూరు మండల కేంద్రంలో ఏఐటియుసి మండల మహాసభ కరపత్రాన్ని వారు ఏఐటియుసి మాజీ జిల్లా అధ్యక్షుడు నల్పరాజు సతీష్ కుమార్తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటే ఏఐటియుసి అండగా నిలబడి కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. కాంట్రాక్టు ,ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4లేబర్ కోడ్లను రద్దు చేయాలని ,కనీస వేతన చట్టాలు అమలు చేయాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తుందని అన్నారు.106 సంవత్సరాలుగా కార్మికులకు అండగా నిలబడి కార్మికుల వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటాలు ,ఉద్యమాలు నిర్వహిస్తున్న ఏఐటియుసి చేయూతనిచ్చి జూలై 1న జరుగు ఏఐటియుసి చండూరు మండల మహాసభకు కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మాజీ జిల్లా అధ్యక్షుడు నల్పరాజు సతీష్ కుమార్ , ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల వెంకటేశ్ , ఆలేటి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు మించిన ఆస్తి లేదు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** విద్యకు మించిన ఆస్తి లేదని ప్రతి ఒక్కరూ చదువుకొని విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రయోజకులుగా అవ్వాలని చాడ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఆయన సోమవారం పిఎంఎస్హెచ్ఆర్ఐ ఎంపిపిఎస్ చాడలోఎల్కెజి, యుకేజీ, 1వ తరగతి విద్యార్థులకు ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన గదులు, సుశిక్షుతులైన ఉపాధ్యాయులు ఉంటారని, ఆట పాటలతో నాన్యమైన విద్యను అందిస్తారని ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ప్రజలను కోరారు. కాంప్లెక్స్ హెచ్ ఎం బాలగంగాధర్ రెడ్డి రిటైర్డ్ ఉపాధ్యాయులు జక్క యాది రెడ్డి, ఉప సర్పంచ్ పెలిమెల్లి భూమయ్య, వార్డు సభ్యులు మల్గ పద్మ, బొడ్డుపల్లి వెంకన్న, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, అబ్రహం, ప్రధానోపాధ్యాయు రాలు కృష్ణ వేణి, ఉపాధ్యాయులు లింగయ్య ప్రమోదిని పాల్గొన్నారు.

## సిఎం దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం పట్టణంలోని ఎన్జి కాలేజీ ఎదుట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లగొండ అంజి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి అంశాలపై చర్చించకుండా,వ్యక్తిగత విమర్శలు చేస్తూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో జయచందన్, నరేందర్ రెడ్డి, వర్కల అంబేద్కర్, బన్నీ, నరేష్ పాల్గొన్నారు.

